

ములుగులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్**

హాజీపూర్, మే 22 : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం మండలంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గల స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్‌లను జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్‌లను పర్యవేక్షించారు.



స్ట్రాంగ్ రూమ్ సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేస్తా

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : వరంగల్ – నల్గొండ – ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ములుగులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్, రెబ్బెన మండల నాయకుడు సంజీవ్ పాల్గొన్నారు.

# వైన్సుల్లో నిల్.. బెల్ట్ షాపుల్లో ఫుల్

**చిల్లర దందాకు తెరలేపిన యజమానులు**

- దుకాణాల్లో ఉంచకుండా బెల్ట్ షాపులకు అధిక రేట్లకు విక్రయం
- ఒక్కో బీరుపై రూ. 200 దాకా వసూలు
- మద్యం ప్రియుల జేబులకు చిల్లు



కాసిపేట, మే 22 : కాసిపేట మండలంలోని వైన్స్‌ల యాజమానులు చిల్లర దందాకు తెర లేపారు. వేసవిలో బీర్ల అమ్మకాలు విపరీతంగా సాగుతుండగా, దీనిని ఆసరాగా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. మద్యం షాపుల్లో బీర్లు అందుబాటులో ఉంచకుండా.. బెల్ట్ షాపులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా విక్రయాలు చేపడుతుండగా, ఎక్సైజ్ అధికారులు 'మామూలు'గా తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లైట్ బీర్ రూ.150, స్ట్రాంగ్ బీర్ రూ.160 విక్రయించాల్సి ఉంది. వైన్స్‌లలో ఎమ్మార్పీ రేట్లకు అమ్మితే ఏం లాభం వస్తుందనుకున్నారో ఏమో.. విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు అధిక రేట్లకు అమ్ముతున్నారు. వైన్స్‌లలో బీర్లు దొరకకపోవడంతో ఇక చేసేదేమీ లేక మద్యం ప్రియులు బెల్ట్ షాపులను ఆశ్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రూ.200లు పెట్టి కొంటూ నష్టపోతున్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో బీర్లు అమ్ముడవుతుండగా, లక్షల్లో దండుకుంటున్నారు. బీర్లు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారంటూ మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్

# కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలి

**బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్**

చెన్నూర్, మే 22: చెన్నూర్ మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చెన్నూర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐని కలిసి కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుద్దాల గ్రామంలోని రాజబాపు, కాచన్‌పల్లి గ్రామంలోని కుందుగుల విజయ్ ఇండ్లలోకి కాంగ్రెస్ కార్యకర్తలు అక్రమంగా చొరబడి బీఆర్ఎస్ కార్యకర్తలతో పాటు వారి కుటుంబ సభ్యులపైనా దాడులు చేశారన్నారు. పోలీసులు దాడులకు పాల్పడ్డ కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయకుండా అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని పోలీసులను కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్య పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, దోమకొండ అనిల్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, ఆసంపల్లి శ్రీనివాస్, భారతి పాల్గొన్నారు.



దుస్తుల జాబితాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్



సారంగపల్లిలో పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

# ఏకరూప దుస్తులు సకాలంలో ఇవ్వాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్**

మందమర్రి, మే 22 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రి పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఏకరూప దుస్తుల తయారీ తీరును ఆయన పరిశీలించారు. కుట్టు కేంద్రానికి కేటాయించిన జాబితాను ఆయన పరిశీలించారు. నాణ్యత పాటించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ఏకరూప దుస్తుల కుట్టు పనులను వేగవంతం చేసి వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశించారు. వచ్చే నెల 12వ తేదీ నాటికి అన్ని పాఠశాలలకు సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం లలిత కుమారి, సీసీ చారి పాల్గొన్నారు.

**అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన**

మందమర్రి రూరల్,మే 22 : సారంగపల్లి, చిర్రకుంట పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఇప్పటికే గుర్తించామని, అందుకనుగుణంగా నిధులు కేటాయించామని తెలిపారు. స్థానికంగా ఉండే సిబ్బంది పనులు పూర్తిచేసేలా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్,ఏపీఎం లలిత కుమారి, సీసీ చారి, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

**నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ సురేశ్‌కుమార్**

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : వానకాలం సాగు నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేశ్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసుల గురించి ఆడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. నేరాల నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన వివిధ శాఖల సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, డీసీ ఆర్బీ, ఐటీ, విభాగాల ఎస్ఐలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ప్రశంసా పత్రాలు ఇస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ప్రభుత్వ భూములను కాపాడాలి

- కబ్జా చేసిన వారిని శిక్షించాలి
- అదనపు కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

మంచిర్యాలటౌన్, మే 22 : మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కబ్జాలకు పాల్పడినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మంచిర్యాల మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు సుంకరి రమేశ్, శ్రీరాముల మల్లేశ్, తాజుద్దీన్, నజీరుద్దీన్ జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నంబర్ 140లోని భూమిలో మున్సిపాలిటీ దాదాపు రూ. 5 లక్షలు ఖర్చుచేసి పట్టణ ప్రకృతివనాన్ని ఏర్పాటు చేసిందని, భూ కబ్జాదారులు ఆ ప్రకృతి వనాన్ని ధ్వంసం చేశారని మండిపడ్డారు. సర్వేనంబర్ 283లో కార్మెల్ స్కూల్ వెనకాల ఉన్న ప్రభుత్వ భూమిలో బౌండరీ గోడను నిర్మించారని, దానిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కబ్జాతోపాటు ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారి నుంచి నష్టపోయిన మొత్తాన్ని రికవరీ చేయాలని కోరారు.

# జూన్ ఐదుకల్లా యూనిఫాంలు అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- సిర్పూర్(టీ)లో విస్తృత పర్యటన

సిర్పూర్(టీ), మే 22 : జూన్ ఐదో తేదీలోగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం అచ్చల్లి, సిర్పూర్(టీ), లోనవెల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. అచ్చల్లిలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు. అనంతరం సిర్పూర్(టీ)లోని గొల్లవాడ కాలనీలోగల ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. కటింగ్ మిషన్ లేకపోవడంతో ఐకేపీ ఏపీఎం దుర్గయ్యను మందలించారు. విద్యా సంవత్సరం దగ్గర పడుతున్నదని, ఇంత నిర్లక్ష్యమైతే ఎలా అని ప్రశ్నించారు. గడువులోగా యూనిఫాంలు అందిస్తామని ఏపీఎం వివరించే ప్రయత్నం చేశారు. అనంతరం లోనవెల్లిలోని ఐకేపీ కోనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆఖరు గింజ వరకూ కోనుగోళ్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు(రెవెన్యూ), డీఆర్డీవో ఈఈ, ఆర్డీవో సురేశ్, డీఎల్‌పీవో సురేశ్‌బాబు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, ఏపీవో, ఐకేపీ ఏపీఎం దుర్గయ్య, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సకాలంలో పనులు పూర్తి చేయాలి**

కాగజ్‌నగర్, మే 22 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం పర్ధాన్‌గూడ, సంగంబస్తీలోని ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్ ఉన్నారు.



మండలకేంద్రంలో మహిళ శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే



అమ్మ ఆదర్శ పాఠశాల పురుగతిని తెలుసుకుంటున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

# ఏడుగురిపై కేసు

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : జిల్లాలో చేపట్టిన నేషనల్ హైవే భూ పరిహారం చెల్లింపుల విషయంలో అక్రమాలకు పాల్పడిన ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన తారాబాయికి సంబంధించిన భూమి రోడ్డు వెడల్పులో పోనప్పటికీ రూ. 3 కోట్ల పరిహారం పొందినట్లు గతంలో కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఏసీబీ అధికారులు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలించారు. అక్రమాలు జరిగినట్లు గుర్తించి గతంలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పని చేసిన సిడం దత్తు, డిప్యూటీ తహసీల్దార్ నాగోరావు, సర్వేయర్ భరత్, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శంభూదాస్, లక్ష్మీనారాయణ గౌడ్, డ్రైవర్ తిరుపతితో పాటు పరిహారం పొందిన తారాబాయిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఇదిలా ఉండగా ఏసీ బీ అధికారుల దాడుల్లో దొరికిన ఆధారాలతో మరికొంతమంది పేర్లు కూడా బయటికి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తున్నది.



జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారి

# జీవ వైవిధ్య పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

- రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారి
- జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : వన్యప్రాణులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారి, ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్ అన్నారు. జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. కుమ్రం భీం, అంబేద్కర్ చౌక్ నుంచి తిరిగి అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నది. అనంతరం వారు మాట్లాడుతూ జీవవైవిధ్య రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు అటవీ సంరక్షణలో తమతో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజ రాణి, సెక్షన్ అధికారులు సత్యనారాయణ, లక్ష్మణ్, సతీశ్, కొమ్మాల్, బీట్ అధికారులు రాజేశ్, రజిత, విద్య, ఉమారాణి, స్వప్న, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అందుగులగూడ చెరువులో విష ప్రయోగం

**రెండు క్వింటాళ్ల చేపలు మృత్యువాత**

బెజ్జూర్, మే 22 : అందుగులగూడ గ్రామంలోని మాయలమ్మ చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయగా, సుమారు రెండు క్వింటాళ్ల చేపలు మృత్యువాత పడ్డాయి. అందుగులగూడ గ్రామానికి చెందిన సోదరులైన కొరెత కిష్టు, కోరెత వెంకటి, కోరెత పెంటయ్యలకు సొంతంగా చెరువు ఉన్నది. అదే గ్రామానికి చెందిన తలండి బలరాం వారి వద్ద నుంచి చెరువును లీజుకు తీసుకొని చేపల పెంపకం చేపట్టాడు. సుమారు రూ.50 వేలతో చేపలు పెంచగా, ప్రస్తుతం ఒక్కొక్కటీ 750 గ్రాముల నుంచి కిలోదాకా పెరిగాయి. వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం బలరాం చెరువు వద్దకు వెళ్లి చూడగా, రెండు మూడు చేపలు చనిపోయి నీటిపై తేలుతూ కనిపించాయి. ఎండవేడిమికి చనిపోయి ఉంటాయని భావించి తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు బుధవారం ఉదయం కూడా బలరాం చెరువు వద్దకు వెళ్లేసరికి చేపలన్నీ (సుమారు రెండు క్వింటాళ్లు) చనిపోయి నీటిపై తేలుతూ కనిపించాయి. దీంతో ఒక్కసారిగా బోరున విలపించాడు. చేపలను తిన్న రెండు..మూడు కొంగలు కూడా చనిపోవడంతో విష ప్రయోగం జరిగినట్లు నిర్ధారణకు వచ్చాడు. సమాచారం అందుకున్న బెజ్జూర్ ఏఎస్ఐ మోహన్ అక్కడికి వెళ్లి చేపలు చనిపోయిన తీరును గమనించారు. కానీ బాధితుడు బలరాం ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. సుమారు రూ. 40 వేల నష్టం వచ్చినట్లు బలరాం తెలిపాడు.

**కౌటాల, మే 22 :** మొగడ్‌ధగడ్ చెరువులోని చేపలు మంగళవారం రాత్రి చనిపోయాయి. చేపలు పెంచుతు న్న ఎర్మ సుధాకర్ ఎప్పటిలాగే బుధవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా, చేపలన్నీ చనిపోయి నీటిపై తేలియాడుతూ కనిపించాయి. గత వానకాలంలో రూ. 24 వేల విలువ చేసే చేపలను చెరువులో వేశానని, ఇప్పుడు ఒక్కొక్కటీ కిలో నుంచి కిలోన్నర బరువు పెరిగాయ ని, చేపలన్నీ మృతి చెందడం వల్ల దాదాపు రూ. లక్ష దా కా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. కాగా, చేపలు ఎండవేడికి చనిపోయాయా? లేక ఎవరైనా చెరువులో విష ప్రయోగం చేశారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనా తనకు ఎవరిపైనా అనుమానం లేదని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



కౌటాల: మొగడ్‌ధగడ్ చెరువులో చనిపోయి నీటిపై తేలిన చేపలు



బెజ్జూర్ : చెరువు వద్ద చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న స్థానికులు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

# 'ఉపాధి' కూలీ కుటుంబానికి పరామర్శ

దండేపల్లి, మే 22 : దండేపల్లి మండల కేంద్రం సమీపంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడ్డ ఘటనలో మృతి చెందిన బంగారు మల్లవ్వ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ మల్లవ్వ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని, వారు కోలుకునే వరకూ పనిదినాలు కట్టిస్తూ గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ నాయకులు గొల్ల రాజమల్లు, బొలిశెట్టి రమేశ్, బొమ్మెన మహేశ్, అఖిల్, తదితరులు ఉన్నారు.